VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శుక్రవారం 06 సెప్టెంబర్ 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 52




సీఎంను ఆహ్వానించిన ఖైరతాబాద్ ఉత్సవ కమిటీ


PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# ప్రపంచ గతిని మారుస్తున్న "ఏఐ"



హైదరాబాద్: సరికొత్త ఆవిష్కరణలు ప్రపంచాన్ని మార్చాయని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నేటి తరం అద్భుత ఆవిష్కరణ ఏఐ అని కొనియాడారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో రాష్ట్ర ఐటీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్లోబల్ ఏఐ' సదస్సుకు సీఎం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హైదరాబాద్‌లో జీపీయూ ఆధారిత ఏఐ క్లౌడ్ ఏర్పాటులో భాగస్వామ్యంలో సదస్సులో చర్చించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడారు. కొత్త ఆవిష్కరణలు ప్రజల జీవితాల్లో మార్పులు తెస్తాయి. అవి ఆశలతో పాటు భయాన్నీ తీసుకొస్తాయి. విప్లవాత్మక మార్పులకు హైదరాబాద్ మాదిరిగా ఏ నగరమూ సిద్ధంగా



లేదు. ఏఐ ద్వారా భవిష్యత్తుకు బలమైన పునాది వేశాం. నాస్కామ్ సహకారంతో ఏఐ ఫ్రేమ్ వర్క్‌కు రూపకల్పన జరుగుతుంది. ఆవిష్కరణలకు పారిశ్రామిక నిపుణులతో రాష్ట్ర ప్రభుత్వం కలిసి పనిచేస్తోంది. అందరం కలిసికట్టుగా సరికొత్త భవిష్యత్తును ఆవిష్కరిద్దాం


మిగతా 2లో


- సరికొత్త భవిష్యత్తును ఆవిష్కరిద్దాం ఎఐతో
- ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో ప్రపంచమే మారుతోంది
- ప్రపంచగతిని మార్చేస్తున్న సరికొత్త ఆవిష్కరణలు
- కొత్త ఆవిష్కరణలు ప్రజల జీవితాల్లో పెను మార్పులు
- 'గ్లోబల్ ఏఐ' సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి పిలుపు

## వచ్చే డీఎస్సీలో 6 వేల ఉపాధ్యాయ పోస్టులు

సమాజం అభివృద్ధి చెందాలన్నా.. నాగరికతతో ముందుకు వెళ్లాలన్నా.. అది విద్య ద్వారానే సాధ్యమని, ఆ విద్యను అందించే గురువుల ఆలోచనలను పరిగణనలోకి తీసుకొని తమ ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.

- ఈ ప్రజాప్రభుత్వం విద్యకు, గురువులకు ప్రాధాన్యమిస్తుంది
- విధానపర నిర్ణయాల్లో టీచర్ల ఆలోచనలను పరిగణనలోకి తీసుకుంటున్నాం
- గురుపూజోత్సవంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క





2లో





## మా ఫోన్లు ట్యాప్ అవుతున్నాయి

మీడియా సమావేశంలో పాడి గగ్గోలు



## శివాజీ విగ్రహ తయారీలో అవినీతి

### అందుకే కూలిందన్న రాహుల్

**పుణె:** మహారాష్ట్రలో ఛత్రపతి శివాజీ విగ్రహం కూలడానికి కారణం విగ్రహం తయారీలో శిల్పి అవినీతి ఉందని కాంగ్రెస్ ఎంపి, విపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. దీనిపై ప్రధాని నరేంద్ర మోడీ క్షమాపణలు చెప్పాలన్నారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ కాంగ్రెస్ నాయకుడు పతంగ్ రావు కదం విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు మహారాష్ట్రలోని సాంగ్లీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతేకాక పెద్ద నోట్ల రద్దు(డీ మానిటైజేషన్), తప్పుడు పద్ధతిలో జిఎస్ టి అమలు చేయడంపై కూడా ప్రధాని మోడీ క్షమాపణలు చెప్పాలన్నారు. సింధుదుర్గ్ లోని రాజ్ కోట్ కోట వద్ద శివాజీ విగ్రహం కూలిపోయింది. ప్రధాని మోడీ గత వారం మహారాష్ట్ర సందర్శించి క్షమాపణలు కూడా కోరారు. 'మహారాష్ట్ర చక్రవర్తి మా ఆరాధ్య దైవం' అని కూడా అన్నారు. 35 అడుగుల శివాజీ విగ్రహాన్ని మోడీ గత ఏడాది డిసెంబర్ 4న ఆవిష్కరించారు. కానీ ఆ విగ్రహం ఆగస్టు 26న కూలిపోయింది. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ ' ప్రధాని మోడీ కేవలం మహారాష్ట్ర రాజుకే కాదు రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి క్షమాపణలు చెప్పాలి' అన్నారు. 'ప్రధాని పెద్ద కాంట్రాక్టులను కొంత మంది పారిశ్రామిక వేత్తలకు ఇస్తున్నందుకు, పెద్ద నోట్లను రద్దు చేసినందుకు(డీమోనిటైజేషన్), తప్పుడు జిఎస్ టి విధానం అవలంబించినందుకు, దానివల్ల చిన్న, మధ్య తరహా వ్యాపారులు దెబ్బతినడమేకాక, తద్వారా నిరుద్యోగం పెరిగినందుకు ప్రధాని క్షమాపణలు చెప్పాలి' అని రాహుల్ గాంధీ అనక్నారు. కోట్ల కొద్ది రూపాయల రుణ మాఫీ బడా పారిశ్రామిక వేత్తలకు చేస్తూ, రైతులకు రుణమాఫీ చేయకపోవడంపై కూడా విమర్శించారు. ధనవంతులకు రుణ మాఫీ చేసినప్పుడు, పేదలకు ఎందుకు చేయరు? అని ప్రశ్నించారు. త్వరలో మహారాష్ట్రలో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్, దాని మిత్రపక్షం(మహా వికాస్ అఘడి కూటమి) గెలిచి

## మన ఊరు-మన బడి'ని మధ్యలోనే ఆపేసిన ప్రభుత్వం

- విద్యావ్యవస్థల మరింత బలోపేతం కావాలి
- గురుపూజోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే హరీష్ రావు



**సిద్దిపేట:** విద్యావ్యవస్థ ఇంకా బలోపేతం కావాలని సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని టీటీసీ భవనంలో గురుపూజోత్సవం సందర్భంగా గురువారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో హరీష్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదిన సందర్భంగా గురు పుజోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ గురువులు అందరికీ గురు పుజోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులకు సమాజంలో ఒక ప్రత్యేకమైన స్థానం ఉందని వివరించారు. ఎవరికి దొరకని గౌరవం ఒక ఉపాధ్యాయునికి దొరుకుతుందని అన్నారు. సిద్దిపేట జిల్లా ఉపాధ్యాయులు ఎప్పుడు సిద్దిపేట గౌరవాన్ని కాపాడారని చెప్పారు. రాష్ట్రంలో పదోతరగతి ఫలితాల్లో సిద్దిపేటను రెండో స్థానంలో ఉపాధ్యాయులు నిలిపారని ప్రశంసించారు. రాష్ట్రంలో సిద్దిపేట జిల్లా ట్రిబుల్ ఐటీలో మొదటిస్థానంలో ఉందని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వ తెలంగాణలోని పాఠశాల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశ పెట్టారని చెప్పారు. 'మన ఊరు – మన బడి' పథకంలో ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యా ప్రారంభించామని తెలిపారు. మన ఊరు – మన బడి' పనులను కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యలోనే ఆపేసిందని ఆరోపణలు చేశారు.రాష్ట్రంలో 1700 ప్రభుత్వ పాఠశాలలు ఈ విద్యా సంవత్సరం మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఉపాధ్యాయులకు సంబంధించిన నాలుగు డీఏలు ఇంకా పెండింగ్?లో ఉన్నామని..వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాల్లో ఉచిత కరెంటు లేదని.. స్కవెంజరు?లు లేరని చెప్పారు. విద్యా వలంటీర్లు, ఉపాధ్యాయులు లేక పాఠశాలలు మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని తీసివేతలు, ఏరివేతలు కోతలు పెడుతున్నారని

ఆరోపణలు చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో విద్యా నిలయంగా సిద్దిపేటను మార్చుకున్నామని చెప్పారు. సిద్దిపేట ప్రజలు అన్ని చదువులు

చదవాలని అన్ని కోర్సులు అందుబాటులోకి తెచ్చినట్లు హరీష్ రావు వెల్లడించారు.




## ఛత్తీస్‌ఘఢ్ సరిహద్దుల్లో మరో ఎన్‌కౌంటర్

ఆరుగురు మావోలను మతమార్చిన పోలీసులు




## ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల ప్రవేశాల్లో స్థానికత

స్థానికులంతా స్థానిక కోటా కింద అర్హులే

హైకోర్టులో విచారణ...తీర్పు వెలువరించిన ధర్మాసనం

# చంద్రబాబు పనితీరు ఆదర్శం

అమరావతి :ఏపీ ప్రస్తుతమున్న విపత్కర పరిస్థితుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిద్రాహారాలు మాని మరీ శ్రమించారు. ప్రజలను కష్టం నుంచి గట్టెక్కించేందుకు నిర్విరామంగా పని చేశారు. ఈ నేపథ్యంలోనే చంద్రబాబును డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రశంసల్లో ముంచెత్తారు. పనితనం ఆదర్శమంటూ ఆకాశానికెత్తారు. చంద్రబాబు నాయకత్వం, పాలనలో అవిశ్రాంత కృషి నిజంగా స్ఫూర్తిదాయకమని.. ప్రశంసనీయమని కొనియాడారు. అధికార సంక్షోభం, వ్యవస్థల నిర్వీర్యం, వనరుల దోపిడీ వారసత్వంగా గత ప్రభుత్వం నుంచి వచ్చిందన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో మరోవైపు ప్రకృతి వైపరీత్యం, వీటి నడుమ మీ పాలనా దక్షత, విధి నిర్వహణలో మీరు కష్టపడే విధానం స్ఫూర్తిదాయకం, అభినందనీయమని చంద్రబాబుని పవన్ కల్యాణ్ కొనియాడారు. ‘గౌరవనీయులైన ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారూ, మీ ప్రోత్సాహకరమైన మాటలకు హృదయపూర్వక కృతజ్ఞతలు. గత వైసీపీ ప్రభుత్వం పరిపాలనా సంక్షోభం, సంస్థాగత క్షీణత, వనరుల దోపిడీ వారసత్వాన్ని మిగిల్చింది. ఈ సవాలుతో కూడిన పరిస్థితుల మధ్య.. ఇప్పుడు అపూర్వమైన ప్రకృతి వైపరీత్యాల మధ్య, మీ నాయకత్వం, పాలనలో అవిశ్రాంత కృషి నిజంగా స్ఫూర్తిదాయకం, ప్రశంసనీయం. అటువంటి సమయాల్లో మన ప్రజలను ఆదుకోవడం ప్రభుత్వంతో పాటు నా వ్యక్తిగత బాధ్యతగా నేను భావిస్తున్నాను. సహాయక చర్యల్లో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ వంటి శాఖలు నిర్విరామంగా పనిచేస్తున్నాయి. ఈ సంక్షోభం నుంచి మనం త్వరలోనే బయటపడతామని నేను ఆశిస్తున్నాను‘ అని పవన్ పేర్కొన్నారు.మీ మాటలతో మరింత ఉత్తేజాన్ని కలిగించినందుకు చంద్రబాబు నాయుడు గారికి హృదయపూర్వక ధన్యవాదాలు. అధికార సంక్షోభం, వ్యవస్థల నిర్వీర్యం, వనరుల దోపిడీ వారసత్వంగా గత ప్రభుత్వం నుంచి వచ్చింది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో మరోవైపు ప్రకృతి వైపరీత్యం, వీటి నడుమ మీ పాలనా దక్షత, విధి నిర్వహణలో మీరు కష్టపడే విధానం స్ఫూర్తిదాయకం, అభినందనీయం. ఇలాంటి సమయంలో మన ప్రజలను ఆదుకోవడం మన ప్రభుత్వంతో పాటుగా వ్యక్తిగత స్థాయిలో నా కనీస బాధ్యతగా భావిస్తున్నాను. సహాయ కార్యక్రమాల్లో పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలు యుద్ధప్రతిపదికన పాల్గొంటున్నారు. త్వరలోనే మనం ఈ సంక్షోభం నుంచి బయటపడుతామని ఆశిస్తున్నాను‘ అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## మా ఫోన్లు ట్యాప్ అవుతున్నాయి

**కరీంనగర్:** తన ఫోన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ట్యాప్ చేస్తోందని భారాస హుజూరాబాద్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. ప్రతి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ ఫోన్లను ట్యాప్ చేస్తున్నారన్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మా వ్యక్తిగత సమాచారం ఎలా తెలుస్తోంది. కరీంనగర్ సీపీ ఫోన్ కూడా ట్యాప్ చేస్తున్నారు. మానకొండూరు సీఐకి కాన్ఫరెన్స్ పెట్టడం లేదని మంత్రి, ఎమ్మెల్యేకు ఎలా తెలుసు? ప్రజలకు రక్షణ కల్పించే పోలీసుల ఫోన్లను ట్యాప్ చేయడం సిగ్గుచేటు. రుణమాఫీ కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేవలం 40 శాతం మందికే రుణాలు మాఫీ అయ్యాయి. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ఏ చెక్కులైనా పంపిణీ చేసేందుకు ఎమ్మెల్యేకు హక్కు ఉంటుంది. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు కాంగ్రెస్ పార్టీవి కావు.. అవి ప్రజల సొమ్ము. ఎన్నికల్లో ఓటమిపాలైన అభ్యర్థి చెక్కులు పంచుతున్నారు. దీనిపై హైకోర్టుకు వెళ్తా. సీపీ ఫోన్ ట్యాపింగ్‌కు గురైనపుడు కేంద్రమంత్రి బండి సంజయ్ ఎందుకు స్పందించడం లేదు. దీనిపై సీబీఐ విచారణ జరిపించాలి‘ అని కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## ఛత్తీస్‌ఘఢ్ సరిహద్దుల్లో మరో ఎన్‌కౌంటర్

భద్రాద్రి కొత్తగూడెం: ఛత్తీస్‌గఢ్ తెలంగాణ సరిహద్దుల్లోని ప్రాంతాలు తుపాకీ మోతలతో దద్దరిల్లిపోతోంది. దంతెవాడ ఎన్కౌంటర్ మరువకముందే ములుగు జిల్లా సరిహద్దుల్లో మరో ఎన్కౌంటర్ జరిగింది. ములుగు, కొత్తగూడెం జిల్లాల సరిహద్దుల్లో జరిగిన భారీ ఎన్కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. ములుగు జిల్లా సరిహద్దు దామెర తొడుగు అటవీ ప్రాంతంలో పోలీసులకు మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందగా... మరి కొందరు గాయపడినట్టు తెలుస్తోంది. ఎదురుకాల్పుల ఘటనలో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. కరకగూడెం మండలం రఘునాథపాలెం సమీపంలోని అటవీ ప్రాంతంలో పోలీసులు-మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. మృతుల్లో మణుగూరు ఏరియా కమిటీ కార్యదర్శి లచ్చన్న సహా ఆయన దళానికి చెందిన ఆరుగురు ఉన్నట్లు గుర్తించారు. ఈ కాల్పుల్లో గ్రేహౌండ్ కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలయ్యాయి. రఘునాథపాలెం ప్రాంతంలో గత కొంతకాలంగా ఈ దళం కార్యకలాపాలు కొనసాగిస్తోంది. ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన ఈ దళానికి లచ్చన్న నాయకత్వం వహిస్తున్నారు. మృతుల్లో లచ్చన్నతో పాటు తులసి, శుక్రాం, రాము, దుర్గేష్, కోసి ఉన్నట్లు గుర్తించారు. మావోయిస్టులకు గడ్డుకాలం ఉన్నట్టు ఉంది. వరుస ఎన్‌కౌంటర్లు వారికి కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. బుధవారం ఛత్తీస్‌గడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పదిమంది వరకు మృతి చెందారు. ఇప్పుడు తెలంగాణలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు హతమయ్యారు.

## ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల ప్రవేశాల్లో స్థానికత



**హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా వైద్య కళాశాలల్లో మెడికల్, డెంటల్ కోర్సుల్లో అడ్మిషన్లకు సంబంధించి స్థానికత వివాదంపై పూర్తిస్థాయి వాదనలను విన్న హైకోర్టు గురువారం తీర్పు వెలువరించింది. స్థానికులంతా స్థానిక కోటా కింద అర్హులేనని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టత ఇచ్చింది. స్థానికులు ఎవరనే అంశంపై సరైన మార్గనిర్దేశకాలు లేవని ధర్మాసనం అభిప్రాయపడింది. స్థానికత నిర్ధరణకు సరైన మార్గదర్శకాలు రూపొందించాలని ప్రభుత్వానికి ఆదేశించింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే ప్రవేశాలు కల్పించాలని హైకోర్టు తీర్పు వెలువరించింది. కాళోజీ నారాయణరావు వైద్య యూనివర్సిటీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని ఆదేశించింది.మెడికల్ అడ్మిషన్ల నిబంధనలను సవరిస్తూ రూల్ ’3ఏ’ను చేరుస్తూ ప్రభుత్వం జీవో 33ను జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం విచారణ కొనసాగించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు బి.మయూర్‌రెడ్డి, డి.వి.సీతారాంమూర్తి తదితరులు వాదనలు వినిపించారు. ప్రభుత్వం తీసుకువచ్చిన నిబంధనల సవరణ వల్ల స్థానికులకే ఎక్కువ నష్టం వాటిల్లుతోందన్నారు. ఇతర రాష్ట్రాల వారితోపాటు భారతీయ మూలాలున్న ప్రవాసులు ఇక్కడ 4 ఏళ్లు చదువుకుంటే 85 శాతం స్థానిక కోటా కింద అవకాశం దక్కించుకుంటారన్నారు. దీనివల్ల తెలంగాణలో పుట్టిపెరిగిన వారికి నష్టం వాటిల్లుతుందన్నారు. స్థానిక కోటా ఇక్కడ నివాసం ఉన్నవాళ్లకే అడుగుతున్నామని, చదువుకున్నవారు అన్న దానిపై అడగడం లేదన్నారు. ఉద్యోగులు బదిలీ కావడం వంటి పరిస్థితుల్లోనూ.. అలాగే మెరుగైన విద్య కోసం.. ఇంటర్ మరో రాష్ట్రంలో చదువుకున్న తెలంగాణ విద్యార్థి స్థానికుడు కాదనడం సరికాదన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ ఉద్యోగుల పిల్లలకు అవకాశం ఇస్తామన్న ప్రభుత్వం.. ప్రైవేటు ఉద్యోగుల పిల్లలకు అవకాశం నిరాకరించడం వివక్ష చూపడమేనన్నారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరగకూడదన్న ఉద్దేశంతోనే ఈ జీవో తీసుకువచ్చినట్లు తెలిపారు. నిబంధనలు తీసుకువచ్చే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని తెలిపారు. ఈ వివాదానికి సంబంధించి ఇరుపక్షాల వారు పలు సుప్రీంకోర్టు, హైకోర్టుల తీర్పులను ధర్మాసనం ముందుంచారు. వాదనలను విన్న ధర్మాసనం తీర్పు వెలువరించింది. స్థానికులంతా స్థానిక కోటా కింద అర్హులేనని సీజే జస్టిస్ అలోక్ అరాధే ధర్మాసనం తీర్పును వెలువరించింది. స్థానికులు ఎవరనే అంశంపై సరైన మార్గనిర్దేశకాలు లేవని ధర్మాసనం పేర్కొంది. స్థానికత నిర్ధారణకు సరైన మార్గదర్శకాలు రూపొందించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే ప్రవేశాలు కల్పించాలని సచించింది. కాళోజీ వైద్య విశ్వవిద్యాలయం విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని స్పష్టం చేసింది. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల్లో స్థానికత జీవోకు సంబంధించిన అంశంపై హైకోర్టులో విచారణ జరిగింది. వైద్యారోగ్యశాఖ జారీ చేసిన జీవోను పలువురు విద్యార్థులు సవాల్ చేశారు. నీట్ ప్రవేశ పరీక్ష రాసే సమయానికి విద్యార్థి వరుసగా నాలుగేళు చదివితేనే స్థానికుడిగా పరిగణించాలంటూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలో పేర్కొంది. సర్కారు జారీ చేసిన ఈ జీవో రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కి విరుద్ధమని పిటిషన్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఆయా పిటిషన్లపై వాదనలు విన్న సీజే ధర్మాసనం ఈ మేరకు తీర్పును వెలువరించింది.




# ప్రపంచ గతిని మారుస్తున్న “ఏఐ”.

అని పిలుపునిచ్చారు. రైల్ ఇంజిన్, టీవి, కెమెరాతో ప్రారంభమైన ఆవిష్కరణలు ఇప్పుడు ఆర్టిఫీషియల్ దాకా వచ్చాయిన సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. క్రమంగా టెక్నాలజీ పెరుగుతోంది.. ఎన్నికల ముందు డిక్లరేషన్ లో చెప్పినట్టే ఎఐ కి మొదటి ప్రాధాన్యత ఇస్తూ పెట్టబడి దారులను ఆహ్వానిస్తున్నామనం ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఎఐ రంగంలో పరిజ్ఞానం ఉన్నవారికి అవకాశాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని సీఎం అన్నారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఏఐ రోడ్ మ్యాప్‌ను ఆవిష్కరించారు. రాబోయే రెండు, మూడేళ్లలో రాష్ట్రంలో ఏఐ అభివృద్ధికి చేపట్టే చర్యలను ఇందులో పేర్కొన్నారు. ఈ సదస్సుకు వివిధ ఐటీ సంస్థల ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఏఐలో పూర్తిగా పట్టు సాదించబోతున్నామన్నారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఏటా అభివృద్ధి సాధిస్తూ ముందుకు వెళు న్నామన్నారు. డీప్‌ఫేక్ లాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఏఐని సరైన దారిలో ఉపయోగించుకుంటామని చెప్పారు. ప్రపంచస్థాయి యూనివర్సిటీలతో ఒప్పందం కుదుర్చుకుంటున్నామని పేర్కొన్నారు. ఎథికల్ ఏఐ విషయంలో జపాన్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళు న్నామని చెప్పారు. హైదరాబాద్‌కు సమీపంలో 200 ఎకరాల్లో ఏఐ సిటీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రపంచ స్థాయి ఏఐ కంపెనీలు ఇక్కడ ఏర్పాటు అయ్యేలా చూస్తామని వివరించారు. రాబోయే రెండు రోజులు హెచ్ఐసీసీ వేదికగా ఏఐ పైనా చర్చలు, సెమినార్లు ఉంటాయని శ్రీధర్‌బాబు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ డెవలప్‌మెంట్‌కు మంచి అవకాశాలు ఉన్నాయని శ్రీధర్ బాబు అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దుర్వినియోగం చేయొద్దని ఆయన సూచించారు. హైదరాబాద్ లో 200 ఎకరాలు కేటాయించి ఏఐ సిటీని ఏర్పాటు చేస్తాము. రాబోయే మూడేళ్లల్లో గ్లోబల్ ఏఐ హబ్ గా హైదరాబాద్ అవతరిస్తుందని మంత్రి అన్నారు. ఏఐ పెట్టుబడులకు ఇండియా గమ్యస్థానంగా ఉందని ఐటీ మినిస్టర్ శ్రీధర్ బాబు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో నిపుణులైన 2వేల మంది ఏఐ నిపుణులు సదస్సుకు వచ్చారు.

# రాసలీలల ఎమ్మెల్యేకు షాక్

### పార్టీ నుంచి సస్పెండ్ చేసిన టిడిపి

**అమరావతి:** టీడీపీ మహిళా కార్యకర్తతో అసభ్యంగా ప్రవర్తించిన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను తెలుగుదేశం పార్టీ సస్పెండ్ చేసింది. ఈ మేరకు టీడీపీ హైకమాండ్ ప్రకటన విడుదల చేసింది. ’వివిధ మాధ్యమాలలో సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఒక మహిళను లైంగికంగా వేధించారని వస్తున్న ఆరోపణలను తెలుగుదేశం పార్టీ తీవ్రంగా పరిగణిస్తూ పార్టీ నుంచి సస్పెండ్ చేయడం జరిగింది’ అని టీడీపీ ప్రధాన కార్యాలయం నుంచి ప్రకటన విడుదలయ్యింది. కాగా.. సస్పెన్షన్ తరువాత వివరణ తీసుకోవాలని హైకమాండ్ నిర్ణయించింది. ఆరోపణలు తీవ్రత దృష్ట్యా ముందు సస్పెండ్ చేసి తరువాత వివరణ తీసుకోవాలని హైకమాండ్ నిర్ణయం తీసుకోవడం జరిగింది.

గురువారం ఉదయం నుంచి ఆదిమూలం వ్యవహారానికి సంబంధించి పెద్ద ఎత్తున కథనాలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని సీనియర్ నేతలు, అధికారులు.. సీఎం నారా చంద్రబాబుకు తెలియజేయగా ఆయన సీరియస్‌గా తీసుకున్నారు. కఠిన చర్యలు తీసుకోవాలని.. మరోసారి ఇలాంటి తప్పుడు పనులు చేయడానికి భయపడేలా ఆ చర్యలు ఉండాలని ఆదేశించారు. దీంతో.. పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రధాన కార్యాలయం నుంచి గంటల వ్యవధిలోనే ప్రకటన వచ్చేసింది. ఈ సస్పెన్షన్‌తో తప్పు చేస్తే ఎవరికైనా ఇదే గతి పడుతుందని గట్టిగా హైకమాండ్ వార్నింగ్ ఇచ్చినట్లు అయ్యింది. సత్యవేడు టీడీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై.. పార్టీకి చెందిన మహిళ కార్యకర్త లైంగిక వేధింపులు ఆరోపణలు చేసింది. కొన్ని ప్రైవేటు వీడియోలను సైతం బాధితురాలు రిలీజ్ చేసింది. గురువారం నాడు హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాకు బాధితురాలు, తన భర్తతో కలిసి వచ్చి ఆదిమూలం లైంగిక వేధింపుల పర్వాన్ని బయటపెట్టింది. తిరుపతిలోని బీమాస్ హోటల్‌లో తనపై లైంగిక దాడి చేశాడని బాధితురాలు వెల్లడించింది. ఇప్పటికే సీఎం చంద్రబాబుతో పాటు మంత్రి నారా లోకేష్ కు లేఖ రాశానని తెలిపింది. ఎవరికైనా చెబితే చంపేస్తానంటూ ఆదిమూలం తనపై బెదిరింపులకు దిగాడని బాధితురాలు చెప్పింది. తాము కూడా టీడీపీకి చెందిన వారమేనని ఆమె తెలిపింది. ఒకే పార్టీకి చెందిన వాళ్ళము కావడంతో పలు కార్యక్రమాల్లో ఆదిమూలం కలిసేవారని వెల్లడించింది. అలా పరిచయమైన తరువాత తన ఫోన్ నెంబర్ తీసుకున్నాడని తెలిపింది. తన మొబైల్ కు పదేపదే కాల్స్ చేసేవాడని.. తిరుపతిలోని భీమాస్ హోటల్‌లోని రూమ్ నెంబర్ 109 లోకి రమ్మని చెప్పాడని తెలిపింది. అక్కడ తనను బెదిరించి తనపై ఆదిమూలం లైంగిక దాడికి పాల్పడ్డాడని బాధితురాలు వెల్లడించింది. ఎవరికైనా చెబితే తనతో పాటు కుటుంబాన్ని చంపేస్తానని బెదిరించాడని తెలిపింది. అలా తనపై మూడుసార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడని వెల్లడించింది. చివరకు ఎమ్మెల్యే ఆదిమూలం నిజరూపాన్ని బట్టబయలు చేయడానికి పెన్ కెమెరా పెట్టుకున్నానని తెలిపింది. లైంగికంగా తన కోరిక తీర్చకుంటే కుటుంబం మొత్తాన్ని అంతం చేస్తానని ఎమ్మెల్యే బెదిరించాడని బాధితురాలు వెల్లడించింది. ఇకపై ఎమ్మెల్యే ఆదిమూలం టీడీపీలో ఉండటానికి అర్హుడు కాదని తెలిపింది. ఆదిమూలం గురించి అందరికీ తెలియాలనే పెన్ కెమెరాలో రికార్డు చేశానని వెల్లడించింది. తన దగ్గర సాక్ష్యాలు ఉన్నాయని ఎమ్మెల్యే 100 సార్లు కాల్ చేశాడని పేర్కొంది. రాత్రులు మెసేజ్‌లు చేసి వేధించేవాడని తెలిపింది. రోజుకు ఒక అమ్మాయితో ఎమ్మెల్యే ఎంజాయ్ చేసేవాడని పేర్కొంది. అందమైన అమ్మాయి కనబడితే చాలు తను తనతో ఉండాల్సిందేనని ఆదిమూలం ఎంతో మందిని టార్చర్ చేశాడని వెల్లడించింది. తిరుపతి భీమా ప్యారడైజ్ హోటల్ ఎమ్మెల్యే నీచ చర్యలకు అడ్డా అని తెలిపింది. ఇలాంటి వాళ్ళన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని బాధితురాలు డిమాండ్ చేసింది. ఆయనను ఎలాంటి కార్యక్రమాలకు పిలవొద్దని పేర్కొంది. ఆదిమూలం తమ ఇంటికి వచ్చాడని ఎవ్వరూ సంబరపడి పోవద్దని.. అలా వస్తే మీ భార్య, పిల్లలపై కన్నేస్తాడని పేర్కొంది. ఆదిమూలం కామాంధుడు, రాక్షసుడని.. అతని నుంచి సత్యవేడులోని పార్టీ మహిళా కార్యకర్తలను కాపాడాలని బాధితురాలు వేడుకొంది..



# వచ్చే డీఎస్సీలో 6 వేల ఉపాధ్యాయ పోస్టులు

హైదరాబాద్: విద్యారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, అందుకు తగ్గట్లుగా నిర్ణయాలు కూడా తీసుకుంటున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. అలాగే విద్య నేర్పుతున్న గురువులకు ఈ ప్రభుత్వం అంతే ప్రాధాన్యత ఇస్తోందని భట్టి విక్రమార్క అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 41 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేశారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన రవీంద్ర భారతిలో గురు పూజోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మొత్తం 27,862 ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తామని ప్రకటించారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని నిర్ణయం తీసుకుని జీవో విడుదల చేశామని అన్నారు. రాష్ట్రంలో వరదల సమస్యల వల్ల సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరుకాలేకపోయారని తెలిపారు. ‘ప్రస్తుత కంపెనీల అవసరాలకు అనుగుణంగా మన విద్యావ్యవస్థ లేదు. మన రాష్ట్ర విద్యా వ్యవస్థ ఇంకా మారాల్సి ఉంది. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకే నైపుణ్య యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రంలోని ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తున్నాం. రాష్ట్ర విద్యార్థులు అంతర్జాతీయంగా పోటీ పడేలా తీర్చిదిద్దాలని భావిస్తున్నాం. సమాజాన్ని సన్మార్గంలో పెట్టడంలో గురువులది కీలకపాత్ర. అదృష్టం కొద్దీ మన రాష్ట్రంలో ఆదర్శమైన గురువులు ఉన్నారు. ప్రభుత్వ నిర్ణయాలను మన గురువులు చక్కగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసినప్పుడు చక్కగా సహకరించారు. గురువులు ఎంత గొప్ప వాళ్ళైతే సమాజం కూడా అంత గొప్పగా మారుతుందని భట్టి విక్రమార్క అన్నారు. విద్యను, గురువులను గౌరవించేది కాంగ్రెస్ మాత్రమేనని వ్యాఖ్యానించారు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతోనే ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించామన్నారు. మరో 6 వేల ఉపాధ్యాయ పోస్టుల కోసం ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని డిప్యూటీ సీఎం ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని 27, 862 విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్ అందిస్తామని ప్రకటించారు. ఇవాల్టి నుండే అమలు చేస్తున్నామని.. జీవో కూడా విడుదల చేశామన్నారు.


రాష్ట్రంలో విద్యా వ్యవస్థ ఇంకా మారాల్సి ఉందని.. అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోదండరాంను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు , ఎమ్మెల్యేలు కోదండరాం, నర్సిరెడ్డి, రఘోత్తం రెడ్డి , ఏవీఎన్ రెడ్డి, ఉన్నత విద్య మండలి చైర్మన్ లింబాద్రి, విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, కమిషనర్లు దేవసేన , శృతి ఓజా , ఈవీ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముంపు నుంచి బయటపడుతున్న కాలనీలు బురదను తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

**విజయవాడ:**నగరంలోని పలు కాలనీలు వరద ముంపు నుంచి బయటకొస్తున్నాయి. అగ్నిమాపక, పారిశుద్ధ్య సిబ్బంది పలు చోట్ల బురదను తొలగిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి 113 ఫైరింజన్లు విజయవాడకు చేరుకున్నాయి. ఇప్పటికే 50ꠀ ÷రిరజన్ల ద్వారా సిబ్బంది ఇళ్లలోని మట్టిని తొలగిస్తున్నారు. 54వ డివిజన్‌లో పారిశుద్ధ్య పనులను మంత్రి సవిత పర్యవేక్షించారు. విజయవాడలోని మొత్తం 32 డివిజన్లలో పలు ప్రాంతాలు ముంపునకు గురైనట్లు అధికారులు గుర్తించారు. పైపులైన్ ద్వారా సరఫరా చేస్తున్న నీటిని తాగొద్దని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నామన్నారు. విజయవాడలోని 32 డివిజన్లతో పాటు సమీప 5 గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ 200 రకాల మందులు అందుబాటులో ఉంచారు. వరద ప్రభావిత ప్రాంతం అజిత్‌సింగ్ నగర్‌లో ఆర్టీసీ ఉచిత బస్సులు అందుబాటులో ఉంచారు. ఇక్కడి నుంచి విజయవాడలోని పలు ప్రాంతాలకు 6 బస్సులు వెళ్తున్నాయి. మరోవైపు బుడమేరు వద్ద గండ్లు పూడ్చే పనిలో జలవనరుల శాఖ నిమగ్నమైంది. వర్షంలోనూ ఇక్కడ పనులు కొనసాగుతున్నాయి.

## అదుపు తప్పి కాలువలో బోల్తాపడ్డ లారీ

నిజామాబాద్:లారీ అదుపు తప్పి కాలువలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన నిజాంసాగర్ మండలంలోని నర్సింగ్ రావుపల్లి చౌరస్తా వద్ద గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి-అకోలా జాతీయ రహదారిపై డెగ్లూర్ తాలూకా, కోకల్‌గావ్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ నిజాంసాగర్ మండలంలోని నర్సింగ్ రావుపల్లి చౌరస్తా మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది.


వేగుచుక్క
TELUGU DAILY NEWS
3
శుక్రవారం 06 సెప్టెంబర్ 2024

# తక్కువ వడ్డీకే రూ. 50 లక్షల హెూం లోన్..


















ఇల్లు కట్టుకోవడం లేదా కొనుగోలు చేయడం అనేది ఈ రోజుల్లో చాలా ఖర్చుతో కూడుకున్న పని అని చెప్పొచ్చు. అందుకే చాలా మంది హెూం లోన్లపైనే ఆధారపడుతుంటారు. అయితే హెూం లోన్లు బ్యాంకుల్ని బట్టి వచ్చే మొత్తం సహా వడ్డీ రేట్లు వేర్వేరుగా ఉంటాయి. రూ. 50 లక్షలు అంతకంటే ఎక్కువ హెూం లోన్స్‌పై వడ్డీ రేట్లు దేంట్లో ఎలా ఉన్నాయో చూద్దాం.

మీరు ఇల్లు కొనాలని చూస్తున్నారా? లేదా కట్టుకోవాలనుకుంటున్నారా? అయితే ఎక్కువ మంది దీని కోసం హెూం లోన్ వైపే చూస్తుంటారు. అయితే గృహ రుణం తీసుకునే ముందు వేర్వేరు బ్యాంకుల్లో వడ్డీ రేట్లను పోల్చుకోవాలి. ఒక్కో బ్యాంకుల్లో వడ్డీ రేట్లు ఒక్కోలా ఉంటాయని చెప్పొచ్చు. దీంట్లో క్రెడిట్ స్కోరు, లోన్ మొత్తం, అర్హత, చెల్లించే స్థోమత ఇలా చాలా అంశాలు ప్రభావం చూపిస్తాయి. దీనిని బట్టి బ్యాంకులు హెూమ్ లోన్లపై వడ్డీ రేట్లను నిర్ణయిస్తుంటాయి. దాంట్లో దేంట్లో మనం సరసమైన వడ్డీకి కోరుకున్న మొత్తం లోన్ వస్తుందో ఎంచుకోవాలి. మనం ఇప్పుడు రూ. 50 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ మొత్తం హెూమ్ లోన్స్‌పై తక్కువ వడ్డీ రేట్లు ఉన్న టాప్-5 బ్యాంకుల గురించి తెలుసుకుందాం. లిస్టులో ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఐసీఐసీఐ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంకు వంటివి ఉన్నాయి. క్రెడిట్ స్కోరు ఎక్కువగా ఉంటేనే.. ఎక్కువ మొత్తం లోన్.. సరసమైన వడ్డీ రేటుకే వస్తుందని చెప్పొచ్చు. ఇంకా హెూం లోన్లు తీసుకునే ముందు ఇతర ఛార్జీల గురించి కూడా ముందే తెలుసుకోవాలి.

ఐసీఐసీఐ బ్యాంకు.. ప్రైవేట్ రంగానికి చెందిన దిగ్గజ బ్యాంకుల్లో ఒకటైన ఐసీఐసీఐ బ్యాంకులో రూ. 35 లక్షల నుంచి రూ. 75 లక్షల వరకు హెూం లోన్ వస్తుంది. దీంట్లో వేతన జీవులకు (ఉద్యోగులకు) 9.50 శాతం నుంచి 9.80 శాతం వరకు వడ్డీ ఉంది. అదే సెల్ఫ్ ఎంప్లాయిడ్ వారికి అయితే 9.65 శాతం నుంచి 9.95 శాతంగా ఉన్నాయి. రూ. 75 లక్షల కంటే ఎక్కువ లోన్ కోసం అయితే వడ్డీ రేట్లు మళ్లీ పెరుగుతాయి. ఇది వరుసగా 9.60-9.90 శాతం, 9.75-10.05 శాతంగా ఉన్నాయి.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు.. అతిపెద్ద ప్రైవేట్ బ్యాంక్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో రూ. 50 లక్షల కంటే ఎక్కువ గృహ రుణంపై ప్రస్తుతం వడ్డీ రేట్లు 8.90 శాతం నుంచి 9.60 శాతం మధ్య ఉన్నాయి. ఇది స్టాండర్డ్ హెూం లోన్ వడ్డీ రేటు కాగా.. ప్రత్యేక ఆఫర్ కింద వడ్డీ రేట్లు చూస్తే 8.55 శాతం నుంచి 9.10 శాతం మధ్య ఉన్నాయి.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రభుత్వ దిగ్గజ బ్యాంక్.. భారతీయ స్టేట్ బ్యాంక్ హెూం లోన్లపై వడ్డీ రేట్లను రుణ గ్రహీత క్రెడిట్ స్కోరు ఆధారంగా విధిస్తుంది. మంచి క్రెడిట్ స్కోరు ఉన్న వారికి గృహ రుణంపై వడ్డీ రేట్లు 9.15 శాతం నుంచి 9.55 శాతంగా ఉన్నాయి. క్రెడిట్ స్కోరు 700-749 మధ్య ఉంటే వడ్డీ 9.35 శాతం నుంచి 9.75 శాతానికి పెరుగుతుంది. ఇక 650-699 గా క్రెడిట్ స్కోరు ఉన్నవారికి వడ్డీ రేట్లు 9.45 శాతం నుంచి 9.85 శాతంగా ఉంది. ఇంకా సిబిల్ స్కోరు తక్కువుంటే 9.65 శాతం నుంచి 10.05 శాతంగా ఉంది.

పంజాబ్ నేషనల్ బ్యాంక్.. ప్రభుత్వ రంగ దిగ్గజ బ్యాంకుల్లో ఒకటిగా ఉన్న పీఎన్‌బీ.. 800 కంటే ఎక్కువ క్రెడిట్ స్కోరు ఉన్నవారికి రూ. 30 లక్షల కంటే ఎక్కువ హెూం లోన్‌పై 8.40 శాతం వడ్డీనే విధిస్తుంది. ఇక క్రెడిట్ స్కోరు 750 గా ఉంటే గనుక వడ్డీ రేటు 9.45 శాతం నుంచి ప్రారంభం అవుతుంది. లోన్ మొత్తాన్ని బట్టి దీంట్లో మార్పులుంటాయి. 700-749 మధ్య క్రెడిట్ స్కోరు ఉంటే 9.90 శాతం వడ్డీ రేటు ఉండగా.. అంతకంటే తక్కువ సిబిల్ స్కోరుకు 11 శాతం వడ్డీ పడుతుంది.

బ్యాంక్ ఆఫ్ బరోడా.. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రెండో అతిపెద్ద బ్యాంక్ అయిన బ్యాంక్ ఆఫ్ బరోడాలో స్థిరంగా వడ్డీ రేట్లు ఉన్నాయి. దీంట్లో రూ. 50 లక్షలు అంతకంటే ఎక్కువ హెూం లోన్‌పై వడ్డీ రేట్ల శ్రేణి 8.40 శాతం నుంచి 10.60 శాతంగా ఉన్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులన్నింటిలో ఎస్‌బీఐ మొన్నటివరకు స్పెషల్ క్యాంపెయిన్ కింద వడ్డీ రేట్లలో రాయితీ ఇచ్చిన సంగతి తెలిసిందే.

# నలందలో



## ఘనంగా “ఉపాధ్యాయ దినోత్సవం”.

**వేగుచుక్క న్యూస్,ఆర్మూర్, సెప్టెంబర్ 5**

మండలంలోని మామిడిపల్లిలో గల నలంద హై స్కూల్ లో ఉపాధ్యాయ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం ప్రసాద్, సాగర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలని అన్నారు. గురువు లేనిదే భవిష్యత్తు లేదని అన్నారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులకు వ్యాసరచన మరియు ఉపన్యాసా పోటీలు నిర్వహించి, పోటీలలో మొదటి మూడు స్థానాలలో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తరువాత ఉపాధ్యాయులను పూలమాల, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థుల తోపాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.











# ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు.

## “సత్యశోధక్” ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య.



**వేగుచుక్క న్యూస్, సిరికొండ, సెప్టెంబర్ 5:**

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని “సత్యశోధక్” పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు. రేపటి తరాన్ని తీర్చి దిద్దే నేటి గురువులు గురుతర బాధ్యతతో ఉత్తమ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని అన్నారు. భారత మాజీ రాష్ట్రపతి, భారత రత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవాన్ని మరియు విశ్వమాత నోబెల్ శాంతి గ్రహీత, భారత రత్న మదర్ థెరిస్సా వర్ధంతి సందర్భంగా గురువారం సత్యశోధక్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ ఆర్. నర్సయ్య ఉపాధ్యాయులతో కలిసి సర్వేపల్లి రాధాకృష్ణన్, మదర్ థెరిస్సా చిత్ర పటాలకు పూల మాలలను వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే అసమాన తెలివి తేటలు, ప్రజ్ఞా పాటవాలు కల్గి ఉన్న రాధాకృష్ణన్ ఉపాద్యాయ వృత్తిని చేపట్టి అంచెలంచెలుగా అధ్యాపకుడిగా, ఆచార్యులుగా విద్యారంగంలో ఎన్నో అత్యున్నత భాధ్యతలు చేపట్టడని అన్నారు. వృత్తికే వన్నె తేవడమే కాకుండా భారతదేశ ఉప రాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా పదవి బాధ్యతలు చేపట్టి, దేశాభివృద్ధికి కృషి చేసిన మహెూన్నతుడని పేర్కొన్నారు. నిరాడంబరత, నిబద్ధత, కార్యదీక్షత అసమాన ప్రతిభ, క్రమశిక్షణ, పట్టుదల, ఓర్పు, సహనం దృడ సంకల్పం, కఠోర శ్రమతో పనిచేసే రాధాకృష్ణన్ ఆదర్శప్రాయుడని అన్నారు. మానవత్వానికి నిలువుటద్దం, సామాజిక సేవా దృక్పథం అభాగ్యుల ఆశాజ్యోతిగా, దీన జనులకు మాతృ మూర్తిగా పేరొందిన మదర్ థెరిస్సా గొప్ప మానవత్వం గల మహిళా మూర్తి అని అన్నారు.

మహనీయుల జీవిత ఇతి హాసాలను ఈ తరం పిల్లలు స్పూర్తిగా తీసుకుని మానవీయ విలువలు కలిగిన సామాజిక అభివృద్ధి నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




## కలకత్తా డాక్టర్ కి మద్దతుగా సంఘీభావం.



**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్**

నగరంలోని అశోక ఎవెన్యూ అపార్ట్మెంట్ నివాసులు కోల్కత్తా డాక్టర్ కు మద్దతుగా సంఘీభావం తెలియజేస్తూ బుధవారం రాత్రి విద్యుత్ లైట్లను ఆపివేసి, క్యాండిల్ ని వెలిగించారు. డాక్టర్ మరణానికి కారకులైన వారిని, అత్యాచారానికి పాల్పడిన వారి పై తగిన చర్య తీసుకోవాలని అపార్ట్మెంట్ వాసులు కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఇంద్రాక్షి, అశోకా ఎవెన్యూ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు పరుచూరి కోటేశ్వరరావు, రమణ గుప్త కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో డా.శ్రీధర్ రావు, డా.జగన్ కుమార్, డా.స్వాతి మంచాల, డా.ఇందు కుషి, డా. ఇండిరాక్షి తదితరులు పాల్గొన్నారు.

## అరబిందో ఫార్మా సంస్థ రూ.5 కోట్లు విరాళం.



**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 5:**

వరద బాధితుల సహాయార్థం ప్రఖ్యాత అరబిందో ఫార్మా సంస్థ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.5 కోట్లు విరాళం ఇచ్చింది. జూబ్లీ హిల్స్ నివాసంలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ను సంస్థ ప్రతినిధులు కలిసి, విరాళం చెక్కును అందజేశారు.సీఎం, డిప్యూటీ సీఎంలను కలిసినవారిలో అరబిందో ఫార్మా వైస్ ప్రెసిడెంట్ నిత్యానంద రెడ్డి, డైరెక్టర్ మదన్ మోహన్ రెడ్డి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఐఎస్ఆర్ రావు ఉన్నారు. వరద బాధితులను ఆదుకోవడంలో అరబిందో ఫార్మా సంస్థ చూపిన ఔదార్యాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు.

## వాసవి శ్రీ నిలయంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు.



**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 5**

:వాసవీ శ్రీ నిలయం సొసైటీ అధ్యక్షులు కట్టా భరత్ రెడ్డి అధ్యక్షతన గురువారం గురుపూజోత్స కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిటీ సివిల్ కోర్టు అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ కన్నోజు మురళీ మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వాసవీ శ్రీ నిలయం లో ఉంటున్న 63 మంది ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ప్రిన్సిపల్స్ మరియు ప్రొఫెసర్లు 62 మందిని సొసైటీ అధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా సిటీ సివిల్ కోర్టు అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ కన్నోజు మురళీ మోహన్ మాట్లాడుతూ, ఏ వ్యక్తి ఎదగడానికైనా వారి ఉన్నతిలో గురువుదే ప్రత్యేక స్థానం అని, మంచి ఉపాధ్యాయుడు జ్ఞానాన్ని అందించడంతో పాటు తన విద్యార్థి వ్యక్తిత్వాన్ని కూడా అభివృద్ధి చేస్తాడు అని అన్నారు. గురువు పట్ల హృదయంలో దాగి ఉన్న గౌరవాన్ని, ప్రేమను వ్యక్తీకరించడానికి మనదేశంలో ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5 న భారత మాజీ రాష్ట్రపతి డా సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జన్మదినాన్ని ఉపాధ్యాయులకు గౌరవ సూచకంగా దేశవ్యాప్తంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం. పద్మ, సూర్యపల్లి ఉమాదేవి, గాజుల సర్వమంగళ, కె పుష్పలత, కె శ్రీలక్ష్మి, ప్రొఫెసర్ డా ఎం కిషన్ కుమార్ తదితరులు ప్రసంగించారు. ఈ సన్మాన కార్యక్రమంలో సొసైటీ డైరక్టర్లు సంజీవరావు, అక్బర్, హర్షవర్ధన్ రెడ్డి, ఉమ, చావా పరమేశ్వరి, విజయ పాల్గొన్నారు.

## సిఎంను ఆహ్వానించిన ఖైరతాబాద్ ఉత్సవ కమిటీ

**హైదరాబాద్** వినాయక నవరాత్రి ఉత్సవాలకు రావాలని సిఎం రేవంత్ రెడ్డిని ఖైరతాబాద్ శ్రీ గణెళిష్ ఉత్సవ కమిటీ ఆహ్వానం అందించింది. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందచేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అర్చకులు ఆశీర్వచనం అందించారు. వీరివెంట ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేదంర్ తదితరులు ఉన్నారు. ఇదిలావుంటే ఖైరతాబాద్ గణెళిణ్ ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు చేశారు.


# రవీంద్రభారతిలో డా. సుధాకర్ గౌడ్‌కు ఘనంగా సన్మానం.

### - టియూలో రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్ట మొదటిసారిగా ఇందూరు బిడ్డకు అరుదైన గౌరవం.

**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 5:**



తెలంగాణ విశ్వవిద్యాలయ సౌత్ క్యాంపస్ ప్రిన్సిపల్, జియో ఇన్ఫర్మటిక్స్ విభాగానికి చెందిన సహా ఆచార్యుడు డా.సుధాకర్ గౌడ్ కు హైదరాబాద్ రవీంద్ర భారతిలో గురువారం నిర్వహించిన ఉపాద్యాయ దినోత్సవం కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. డా.రాధాకృష్ణన్ జయంతి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు కే.కేశవరావు, ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ కోదండరాం, ఏ, వి.ఎన్ రెడ్డి, కుర్ర రఘోత్తమరెడ్డి , అలుగుబిల్లి నర్సిరెడ్డి, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మన్ రిక్క లింబాద్రి ల చేతుల మీదుగా ఉత్తమ అధ్యాపకుడి అవార్డుతో పాటు శాలువా, జ్ఞాపిక, ప్రశంసా పత్రంను, అందుకున్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, ప్రజా పరిపాలనలో పాఠశాల స్థాయి నుండి విశ్వ విద్యాలయాల వరకు విద్యార్థి జీవితం ఉపాధ్యాయుడు తీర్చిదిద్దాలన్నారు. అవార్డు గ్రహీత తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణం ప్రిన్సిపల్, సహా ఆచార్యులు డా.సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ, తనపై మరింత బాధ్యత పెరిగిందని, పలు అంశాలను క్రోడీకరిస్తూ అవార్డు అందజేశరని అన్నారు. ముఖ్యంగా కమ్యూనిటీ ఎంగేజ్మెంట్, స్టూడెంట్ సెంటర్డ్ అప్రోచ్, కొలాబరేషన్ అండ్ టీమ్ వర్క్, రీసెర్చ్ అండ్ పబ్లికేషన్స్, స్కాలర్షిప్, రెస్పెక్ట్ అండ్ ఇంక్లూసింగ్ మరియు పలు అంశాల ఆధారంగా విశ్వవిద్యాలయాల్లో ఉత్తమ అధ్యాపకులను ఎంపిక చేయడంతో వారికి సుధాకర్ గౌడ్ కు పురస్కారం దక్కింది. యూనివర్సిటీకి, సమాజానికి మధ్యలో ఉన్నటువంటి అవినాభావ సంబంధము, ఆయా ప్రాంతాల్లో సమాజాభివృద్ధిలో సుధాకర్ గౌడ్ పోషించిన పాత్రను దృష్టిలో ఉంచుకోవడం, ముఖ్యంగా గతంలో శివాయపల్లి గ్రామం, పొందుర్తి గ్రామం మరియు ఇటీవల దోమకొండ మండల కేంద్రాన్ని దత్తత తీసుకొని గడికోట ట్రస్ట్ వారితో మమేకమై అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. అలాగే విద్యార్థి కేంద్రీకృతంగా విద్యా బోధన మరియు నూతన ఓరవడులు సృష్టించడానికి విద్యార్థులతో కలిసి తన విభాగాన్ని అభివృద్ధి చేయడంలో ప్రముఖ పాత్ర పోషించడం,తన విభాగ అధ్యాపక మిత్రులతోనే కాకుండా ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో సఖ్యతగా మెలుగుతూ పరిపాలనను విజయవంతంగా ముందుకు నడపడంలో ప్రిన్సిపల్ గా తనదైన ముద్రవేశారు. అంతే కాకుండా ఎప్పటికప్పుడు నూతనంగా పరిశోధనలు చేయడం,



తెలంగాణ రాష్ట్రంలోని తెలుగు అకాడమీ యందలి భూగోళ శాస్త్రం కు సంబంధించిన పుస్తకాలను రచించడమే కాకుండా పోటీ పరీక్షలకు సైతం తెలుగు అకాడమీలో అనేక పుస్తకాలను రూపకల్పనలు చేయడం, న్యూఢిల్లీ వారి ఐ సి ఎస్ ఎస్ ఆర్ ప్రాజెక్టులు నిర్వహిస్తుండటం, విద్యార్థులకు ఉపాధి మార్గాలను అన్వేషిస్తూ ఉపాధి కల్పించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు. తెలంగాణ యూనివర్సిటీతోనే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయ అధికారులతో, అధ్యాపక సిబ్బందితో, అధ్యాపకేతర సిబ్బందితో గౌరవప్రదంగా ఉంటూనే వారితో అనేక కార్యక్రమాలను యూనివర్సిటీలలో నిర్వహించటం

వారి యొక్క ఉన్నతిని విద్యార్థులకు ఎప్పటికప్పుడు చేరవేస్తూ స్ఫూర్తిని చూపే కార్యక్రమాలను చేపట్టి విశ్వవిద్యాలయ కీర్తి ప్రతిష్టలను పెంపొందించడంలో అందరినీ కలుపుకుపోయ దక్షిణ ప్రాంగణ అభివృద్ధికి కృషి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్ సుధాకర్ గౌడ్ కు ఉస్మానియా విశ్వవిద్యాలయం తో పాటు పలు విశ్వవిద్యాలయ ఆచార్యులు, పరిశోధన, విశ్వవిద్యాలయ విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

# దివ్యాంగులను డిఫరెంట్ ఎబిలిటీ పర్సన్స్ గా పిలవాలి.

### జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సీనియర్ (సివిల్ జడ్జి) పద్మావతి.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, సెప్టెంబర్ 5:**



దివ్యాంగ పిల్లలను, విద్యార్థులను కించపరచకుండా డిఫరెంట్ ఏబుల్డ్ పర్సన్స్ అని పిలవాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి అన్నారు. గురువారం టీచర్స్ డే ను పురస్కరించుకొని స్థానిక మారుతీ నగర్ లో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రికన్స్ట్రక్షన్ వారి దివ్యాంగుల పాఠశాల ప్రాంగణంలో కీర్తిశేషులు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డిఫరెంట్లీ అబ్లెడ్ పర్సన్స్ అన్ని రంగాలలో దూసుకెళ్తున్నారని, వికలాంగులు సకలాంగులు అనే భేదం లేకుండా సకలాంగుల కంటే పలు క్రీడలలో వికలాంగులే ఉన్నత స్థాయి సాధించార ని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ద్వారా డిఫరెంట్ ఏబుల్డ్ పర్సన్స్ కు అన్ని విధాలుగా చేయూతనందిస్తామని అన్నారు. ఆంధ బాలబాలికలకు మానసిక బాలబాలికలకు అన్ని విధాలుగా విద్య నేర్పుతూ చేయూతనందిస్తున్న స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య సేవలు మరువలేనివి అని కొనియాడారు. ఈ సందర్భంగా జాదు రంగనాథ్ చేసిన మ్యాజికల్ టిప్స్ అందరికి వినోదాన్ని పంచాయి. కార్యక్రమానికి వచ్చిన బాలబాలికలు ఉపాధ్యాయులు సిబ్బంది అందరూ జాదూ రంగనాథ్ మెజిక్ చూసి కడుపుబ్బా నవ్వుకున్నారు. గంటకు పైగా విద్యార్థులను అదితులను తన మ్యాజిక్ ట్రిప్స్ తో కట్టిపడేశారు. వికలాంగ విద్యార్థిని విద్యార్థులు గురువుల వేషధారణలో వచ్చి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. అనంతరం స్నేహ సొసైటీలో పనిచేస్తున్న దివ్యాంగుల విద్యాభివృద్ధికి తోడ్పడుతున్న టి. రాజేశ్వరి , ఎం. నాన్సీ మంజుల, ఎన్ లక్ష్మి , సిహెచ్ రమేష్, వి గంగాధర్ తదితర ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. దివ్యాంగుల పిల్లలు పాడిన పాటలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రసూల్ బి, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సిఇఓ నాగభూషణం, స్నేహ సొసైటీ కార్యదర్శి ఎస్. సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి, లోకల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బాబా గౌడ్ , వైస్ చైర్మన్ జీవన్ రావు, మానసిక వికలాంగుల పాఠశాల, అందుల ప్రత్యేక పాఠశాల విద్యార్థిని విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు జాతి నిర్మాతలు.

### - జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, సెప్టెంబర్ 5:**



ఉపాధ్యాయులు జాతి నిర్మాతలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించి జిల్లాలోని ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ జిల్లా సాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన జిల్లాలోని 28 మంది ఉపాధ్యాయులను శాలువా, ప్రశంస పత్రంతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు జాతి నిర్మాతలని, సమాజంలో మీ పాత్ర చాలా గొప్పదని, మిమ్ముల్ని మార్గదర్శకులుగా తీసుకొని మీ అడుగుజాడల్లో నడుస్తూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని అన్నారు. ఇప్పుడు మీ వద్ద చదివేవాళ్ళు 10, 20 సంవత్సరాలలో ఉన్నత స్థానంలో ఉంటారని, ఉపాధ్యాయుల సహకారం వలననే మనమందరం ఈ స్థాయికి చేరుకున్నామని మనల్ని మన ఉపాధ్యాయులు ప్రోత్సహించిన మాదిరిగానే మీరు కూడా విద్యార్థులకు గుణాత్మక బోధన చేస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని అన్నారు.

జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి గురువుల ఔన్నత్యాన్ని గుర్తు చేశారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతికి చేసిన సేవలను కొనియాడారు. జిల్లా విద్యాశాఖ అధికారి రాజు ఈ సందర్భంగా జిల్లాలో విద్యారంగంలో జరుగుతున్న ప్రగతిని వివరించారు.

ఈ కార్యక్రమం లో విద్యాశాఖ సమన్వయ కర్తలు ఉమారాణి, వేణుగోపాల్, నాగవేందర్, కృష్ణ చైతన్య, వెంకట రమణ రావు,జిల్లా పరీక్షల విభాగ అసిస్టెంట్ కమీషనర్ బలరాం, పరీక్షల విభాగ కార్యదర్శి నీలం లింగం, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, మండల విద్యాశాఖ అధికారులు, నోడల్ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉత్తమ ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులు, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

